సాక్షి
వికారాబాద్

గురువారం । 21 । ఆగస్టు । 2025



బ్రిడ్జిలకు మోక్షం కలిగేనా!
వర్షాలు పడిన ప్రతిసారీ ఆయా గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



ఆలయాల్లో భారీ చోరీ
యాలాల మండలం సంగెంకుర్దు పరిధిలోని రెండు ఆలయాల్లో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. 8లో▸



ప్రైవేటుకు దీటుగా బోధన
పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత పెరుగుతోంది. నాలుగేళ్లు నిండక ముందే పిల్లలను స్కూళ్లకు పంపుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు, రేపు ఇంటర్వ్యూలు
అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో పాఠ్యాంశాల బోధనకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. ఫిజియోథెరపీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, తెలుగు బోధించుటకు గాను మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురు, శుక్రవారాల్లో ఇంటర్వ్యూలు, డెమో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 6301013028లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

జిల్లాకు ఉపాధి హామీ పథకం నిధుల మంజూరు
కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో పనుల జాతర – 2025లో భాగంగా (1,366 పనులకు) రూ.2,314.94లక్షలు మంజూరైనట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 43 కొత్త గ్రామ పంచాయతీల్లో నూతన భవనల నిర్మాణానికి రూ.860 లక్షలు 46 అంగన్‌వాడీ భవనాలకు రూ.368 లక్షలు, 650 పశువుల పాకలు రూ.617,50 లక్షలు, 94 మేకల షెడ్లకు రూ.79.90 లక్షలు, 63 పౌల్ట్రీ ఫిడ్స్‌కు రూ.73.88 లక్షలు, 45 అజొల్లా సాగుకు రూ.6.75 లక్షలు, 160 నాడెప్ కంపోస్టు పిట్స్‌కు రూ.40 లక్షలు, 51 చెక్‌డ్యాంలకు రూ.255 లక్షలు, 214 ఇంకుడు గుంతలకు రూ.13,91 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

ఏబీవీపీ పరిగి పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్



పరిగి: అఖిల భారత విద్యార్థి పరిషత్ పరిగి పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను జిల్లా కమిటీ సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఏబీవీపీ జాతీయ వాద భావజాలంతో పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

25న తలనీలాల సేకరణకు బహిరంగ వేలం
కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ కార్యాలయ ఆవరణలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10.15గంటలకు భక్తులు సమర్పించే తలనీలాల సేకరణకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు గంట ముందు రూ.50 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. అన్ని వివరాలు ఆలయ నోటీసు బోర్డులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

ఇన్‌చార్జి చైర్మన్ నియామకం నిలిపివేత
అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే నిలిపి వేయాలంటూ మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏడాదిన్నర క్రితం సంఘం చైర్మన్‌గా ఎన్నికైన చేగూరి భరత్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ని పదవి నుంచి తొలగించి, ఇన్‌చార్జి చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా సహకార శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో భరత్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు భరత్‌కుమార్‌ను తొలగింపు ప్రక్రియతో పాటు జైపాల్‌రెడ్డిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులన్నింటినీ నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో బాటసింగారం సహకార సంఘం వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.

వాష్‌రూం క్లీనింగ్ లిక్విడ్ తాగి యువకుడి ఆత్మహత్య
ఇబ్రహీంపట్నం రూరల్: మద్యం తాగొద్దని తల్లి, సోదరుడు మందలించారని ఓ యువకుడు వాష్‌రూం క్లీనింగ్ లిక్విడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రవికుమార్ కథనం ప్రకారం..ఆదిబట్లకు చెందిన మహేందర్(28) నిత్యం మద్యం తాగి కుటుంబ సభ్యులను వేధించే వాడు. ఎన్నిసార్లు చెప్పినా వైఖరి మారలేదు. ఇదే విషయమై తల్లి, సోదరుడు మంగళవారం అతన్ని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై వాష్‌రూం క్లీనింగ్ లిక్విడ్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియాకి తరలించగా పరి స్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గైరుహాజరు!
టెక్నాలజీని దుర్వినియోగం చేస్తున్న సిబ్బంది



- విధులకు రాకుండానే హాజరైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు
- ఉన్నతాధికారుల నిఘాతో బయటపడిన భాగోతం
- 63 మంది పంచాయతీ కార్యదర్శులకు చార్జిమెమోలు

వికారాబాద్: విధులకు రాకుండానే కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు వచ్చినట్లు హాజరు వేసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. టెక్నాలజీలోని లూప్ హోల్స్‌ను పసిగట్టి విధులకు ఎగనామం పెడుతున్నారు. ఈ విషయం బయటికి పొక్కడంతో ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. దీంతో అసలు దొంగలు దొరికిపోయారు. పంచాయతీ రాజ్, విద్యా శాఖల్లో ఈ వ్యవహారం బయటపడింది. పదిహేను రోజుల క్రితం కొడంగల్ నియోజకవర్గంలోని పలు పాఠశాలలను కలెక్టర్ ప్రతీక్‌జైన్ తనిఖీ చేశారు. ఆ సమయంలో కొంత మంది ఉపాధ్యాయులు విధులకు హాజరుకాలేదు.. కానీ ఆన్‌లైన్‌లో వచ్చినట్లు రికార్డు కావడంతో పూర్తిస్థాయి విచారణ జరపాలని అన్ని శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో అసలు విషయం బయటపడింది. చాలా వరకు పంచాయతీ కార్యదర్శులు విధులకు రాకుండానే ఇంటి వద్ద నుంచే హాజరు వేసుకున్నట్లు గుర్తించారు. జిల్లాలో 594 గ్రామ పంచాయతీలు ఉండగా 553 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 63 మంది విధులకు రాకుండానే హాజరు వేసుకున్నట్లు తేలింది. దీంతో వీరందరికీ చార్జి మెమోలు జారీ చేశారు. విద్యా శాఖలో 4,588 మంది ఉపాధ్యాయులు ఉండగా 75 మంది ఈ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. కొన్ని చోట్ల మధ్యాహ్న భోజనం కార్మికుల హాజరు ఆన్‌లైన్ చేయలేదు. ఈ విషయాలపై ఎంఈఓల నుంచి వివరణ కోరారు.

అన్ని శాఖల్లో ఆన్‌లైన్ హాజరు

విధుల్లో పారదర్శకత తేవడానికి ఆన్‌లైన్ హాజరు విధానాన్ని అమలులోకి తెచ్చారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని అమలు చేస్తున్నారు. జూన్ చివరి వారంలో విద్య, ఆరోగ్య శాఖల్లో ఈ విధానాన్ని ప్రారంభించారు. జూలై మొదటి వారంలో అన్ని శాఖలకు విర్తింపజేశారు. కలెక్టరేట్‌లో కూడా అమలు చేశారు. ఆరోగ్య శాఖ పరిధిలో 24 పీహెచ్‌సీలు ఉండగా రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించారు. విద్యాశాఖ పరిధిలో 1,063 పాఠశాలలు ఉండగా ముందుగా వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నెపల్లి ప్రభుత్వ పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని శాఖల్లో అమలు చేస్తున్నారు. జిల్లాలో 6,500 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖలో 4,588 మంది ఉపాధ్యాయులు, ఆరోగ్యశాఖలో 600 పైచిలుకు మంది, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 650 పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు.

ప్రతి నెలా పర్యవేక్షిస్తేనే..

గతంలో కలెక్టరేట్, విద్య, ఆరోగ్యశాఖల్లో మాత్రమే బయోమెట్రిక్ విధానం అమలు చేసేవారు. గత కలెక్టర్ నారాయణరెడ్డి జీయో అటెండెన్స్ పేరుతో ఆన్‌లైన్ హాజరు విధానం అమలు చేశారు. ఆయన బదిలీపై వెళ్లడంతో ఆ విధానానికి స్వస్తి పలికారు. ఆ తర్వాత విధి నిర్వహణ, రోజువారి హాజరులో పారదర్శకత కొరవడింది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రస్తుత కలెక్టర్ ప్రతీక్‌జైన్ తిరిగి ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం మొబైల్ యాప్ ద్వారా చేయాలని నిర్ణయించారు. గత ఫెయిల్యూర్స్‌ను దృష్టిలో ఉంచుకొని నెలవారి పర్యవేక్షణ ఉంటేనే ఈ కార్యక్రమం సక్సెస్ అవుతుందనేది స్పష్టమవుతోంది. గతంలోనూ ఆన్‌లైన్ హాజరు విధానం అమలు చేసినా ఎవరెవరు ఎన్ని రోజులు విధులకు డుమ్మా కొట్టారు.. ఎన్ని రోజులు ఆలస్యంగా వచ్చారు.. అనే వివరాలు గుర్తించలేదు. హెచ్చరించడం కానీ శాఖాపరమైన చర్యలు తీసుకోవటం లాంటివి చేయలేదు. దీంతో ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకాడం మానేసరనే విమర్శలు ఉన్నాయి.

చర్యలు చేపట్టాం



ఆన్‌లైన్ హాజరు విధానాన్ని కొంతమంది పంచాయతీ కార్యదర్శులు మిస్‌యూజ్ చేశారు. ఈ విషయం మా దృష్టికి రావడంతో మా వద్ద ఉన్న ఫేస్ రీడింగ్ యాప్‌లో చెక్ చేశాం. 63 మంది తప్పు చేసినట్లు గుర్తించాం. వారికి చార్జి మెమోలు ఇచ్చాం. ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాం. నిత్యం ఆన్‌లైన్ హాజరును పరిశీలిస్తున్నాం.

– జయసుధ, డీపీఓ

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సుధాకర్

తాండూరు వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్

తాండూరు రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి శాస్త్రవేత్తలుగా ఎదగాలని తాండూరు వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ అన్నారు. పెద్దేముల్ మండలం గొట్లపల్లి శివారులోని తెలంగాణ మోడల్ స్కూల్లో విద్యార్థులకు పర్యావరణం, సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల రక్షణ కోసం రైతులు క్రిమిసంహారక మందులు వాడుతున్నారని, తద్వారా మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. దీన్నిదృష్టిలో ఉంచుకొని సేంద్రియ వ్యవసాయం చేయాలని తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. రోజురోజుకు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని.. దీంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ ఆలోచనలు పెంచుకొని మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గాయత్రి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూస్తాం

పరిగి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ అన్నారు. మండలంలోని రాపోల్ గ్రామానికి చెందిన వీరప్ప అనారోగ్యానికి గురికావడంతో సీఎం సహాయనిధి కింద చికిత్స నిమిత్తం రూ.లక్ష ఎల్‌ఓసీ చెక్‌ను బుధవారం అందజేశారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, మాణిక్యం, శ్రీశైలం పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ చెక్కు అందజేస్తున్న నాగవర్ధన్

నానో యూరియాపై అవగాహన కల్పించండి

- ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి
- ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

దుద్యాల్: నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల దుకాణాదారులకు పలు సూచనలు చేశారు. ద్రవ రూప యూరియా వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. మండలంలో ఎరువుల కొరకు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం, కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం యజమాని ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
కొడంగల్ రూరల్: వరుస వర్షాల నేపథ్యంలో రైతులు పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి సూచించారు. బుధవారం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. నానో యూరియా వాడేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజు రాథోడ్, శ్రీపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతి రాజ్యం!

- చేయి తడిపితేనే ఫైల్ కదిలేది
- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని తీరు



తాండూరు: ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతి రాజ్యమేలుతోంది. లంచావతారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఓ వైపు ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నా వీరి ఆగడాలు మాత్రం ఆగడం లేదు. వివిధ పనుల నిమిత్తం తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కార్యాలయాలకు వచ్చే ప్రజలను కొంతమంది ఉద్యోగులు పీక్కు తింటున్నారు. చేయి తడిపితేనే ఫైలు కదిలేది అనే విధంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, విద్యుత్, ఎక్సైజ్, మైన్స్, ఆర్‌అండ్‌బీతో పాటు మరికొన్ని ప్రధాన శాఖలు అవినీతిమయంగా మారాయి.

- తాండూరు మున్సిపల్ పరిధిలోని 7వ వార్డుకు చెందిన ఓ పార్టీ నాయకుడు తమ కాలనీలో ఇళ్లు కట్టుకున్న వారికి ఇంటి నంబర్ కేటాయించాలని మున్సిపల్ ఆఫీసులోని సీనియర్ అసిస్టెంట్‌ను రమేశ్‌ను కలిశాడు. ఇందుకు ఆయన ఒక్కో ఇంటికి రూ.6 వేలు ఇవ్వాలంటూ పది ఇళ్లకు రూ.60 వేలు వసూలు చేశాడు. లబ్ధిదారుల నుంచి ఈ మొత్తం ఇప్పించడంతో వారికి ఇంటి నంబర్లు కేటాయించారు. అనంతరం ఇదే నాయకుడు తాను నిర్మించుకున్న రేకుల షెడ్డుకు ఇంటి నంబర్ ఇవ్వాలని కోరగా రమేశ్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అన్ని ఆధారాలతో ఏసీబీకి ఫిర్యాదు చేసినా నెల రోజుల పాటు కాలయాపన చేశారని, దీంతో నేరుగా ఐజీకి ఫోన్ చేయడంతో అప్రమత్తమైన జిల్లా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా సీనియర్ అసిస్టెంట్‌ను పట్టుకున్నారని బాధితుడు తెలిపాడు.
- దాడులు జరుగుతున్న విషయం తెలియడంతో కమిషనర్ విక్రంసింహారెడ్డితో పాటు సిబ్బంది మొత్తం అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. ఆ తర్వాత ఫోన్లు ఆఫ్ చేసుకున్నారు. దీంతో ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో తేల్చాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రమేశ్‌ను ఏసీబీకి పట్టించిన వ్యక్తి 2022 డిసెంబర్‌లో తాండూరు సబ్ రిజిస్ట్రార్ జమీరొద్దీన్‌ను సైతం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టించాడు.

- తాండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. గతంలో డీఏఓ దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే.

చంపుతామని బెదరిస్తున్నారు..



ఫిర్యాదు కాపీని చూపిస్తున్న ఇర్షాద్

తాండూరు టౌన్: మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేశ్‌ను ఏసీబీకి పట్టించానని కక్షతో తనను చంపుతామని బెదిరిస్తున్నారని బాధితుడు ఇర్షాద్ వాపోయాడు. ఈ మేరకు బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రమేశ్ తమ్ముడు నాగేశ్‌తో పాటు బాతుల నాగు వ్యక్తి మున్సిపల్ ఆఫీసులో తనను బెదిరించారని తెలిపాడు. వీరినుంచి తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నాడు. ఈ విషయమై సీఐ సంతోష్‌కుమార్‌ను అడగగా సాక్ష్యాధారాలను పరిశీలించి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పరిగిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- పరిగిలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ
- పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



తహసీల్దార్ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: పరిగి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నిరు. బుధవారం పట్టణంలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. తహసీల్దార్ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందాలన్న సంకల్పంతోనే వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇందుకు రూ.27 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి రంగాలపై ఎక్కువ దృష్టి సారించిందన్నారు. నస్కల్ గ్రామ సమీపంలో రూ.10 కోట్లతో మహిళల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు పూర్తిచేసి ఈ ప్రాంతానికి సాగునీరు తెస్తామని హామీ ఇచ్చారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు చిన్న నర్సింహులు, శ్రీను, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేం

దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు ఎప్పటికి మరువలేమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నా రు. బుధవారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్‌గాంధీ అని కొనియాడారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

దోమ: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలో ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన కుట్టుమిషన్లను అర్హులైన మహిళలకు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జాకటి వెంకటయ్య, నాయకులు మాలి శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

కుల్కచర్ల: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. మహిళలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మాజీ ఎంపీపీ సత్యమ్మ పాల్గొన్నారు.

సత్వరం పూర్తి చేయాలి

- దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం డాక్టర్ గోపాలకృష్ణన్
- తాండూరు రైల్వే స్టేషన్ సందర్శన



తాండూరు రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న గోపాలకృష్ణన్

తాండూరు: అమృత్ భారత్ నిధులతో రైల్వే స్టేషన్లలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు భారీ వర్షాలు అడ్డంకిగా మారాయని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం డాక్టర్.గోపాలకృష్ణన్ తెలిపారు. బుధవారం తాండూరు రైల్వే స్టేషన్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. అమృత్ భారత్ స్కీం కింద రూ.24 కోట్లతో తాండూరు రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ఎస్కలేటర్, ట్రాలీ రూట్, వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్ తదితర పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం తాండూరు మార్వాడి యువ మంచ్ ప్రతినిధులు డీఆర్ఎంను కలిసి తాండూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.

డబ్బు తీసుకుని విరాసత్ చేయించలేదు

మీ సేవ నిర్వాహకుడిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

పూడూరు: భూమి విరాసత్ చేయించేందుకు రూ.50 వేలు తీసుకుని, పని చేయకుండా కాలయాపన చేస్తున్న పూడూరు మీ సేవ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ భరత్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పూడూరుకు చెందిన చాకలి బుచ్చన్న తన భూమిని విరాసత్ చేయించాలని మీ సేవ నిర్వాహకుడు షాబాద్ సురేష్‌ను కలిశాడు. ఇందుకు లక్ష రూపాయలు అవుతుందని చెప్పగా.. మొదటి విడతగా రూ.50 వేలు ఫోన్ పే ద్వారా పంపాడు. పని పూర్తయిన తర్వాత మిగిలిన డబ్బులు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. కానీ డబ్బులు తీసుకున్న సురేశ్ ఏడాదిన్నరగా తన పని చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. తన డబ్బులైనా తిరిగి ఇవ్వమని కోరినా స్పందించడం లేదన్నాడు. అతనిపై చర్య తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరాడు. ఇదిలా ఉండగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న మీ సేవ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్‌పటేల్, పాండు, శ్రీశైలం తదితరులు డిమాండ్ చేశారు.



పూడూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

రైతులకు పరిహారం అందించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్

అనంతగిరి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎకరాకు రూ.లక్ష నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనా వేయాలన్నారు. పత్తి, మొక్కజొన్న, వరి, కంది, పసుపు, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు.



పంటలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

క్లుప్తంగా

మండపాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్‌ఐ యాదగిరి


మాట్లాడుతున్న ఎస్‌ఐ

దుద్యాల్: గణపతి మండపాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ యాదగిరి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న వినాయక చవితి పురస్కరించుకుని మండలంలోని ప్రతీ గ్రామంలో వినాయకుల ప్రతిమలను ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందుకుగాను మండల వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న వినాయక మండపాలకు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలన్నారు. దీనికోసం రాష్ట్ర పోలీస్ శాఖ ఒక ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించిందన్నారు. ఈ వెబ్ సైట్‌లో మండపాలకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేస్తే అనుమతి లభిస్తుందని తెలిపారు. ఈ అనుమతి ఉంటేనే అవసరమైన సమయంలో పోలీస్ బందోబస్త్ ఏర్పాటుకు అవకాశం ఉంటుందని ఆయన సూచించారు.

పోలీసులకు చిక్కిన గ్యాంగ్ రేప్ నిందితుడు


రహమతుల్లా

మంచాల: గ్యాంగ్ రేప్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని మంచాల పోలీసులు బుధవారం చాకచక్యంగా పట్టుకున్నారు. సీఐ మధు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గుజరాత్ రాష్ట్రం బచ్చావ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2006లో గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితుడు సికిందర్ రహమతుల్లా 2014 వరకు శిక్ష అనుభవించాడు. 2014లో పెరోల్‌పై బయటకు వచ్చి, పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. ఇతని కోసం గుజరాత్ పోలీసులు 11 ఏళ్లుగా గాలిస్తున్నారు. సాంకేతిక ఆధారాలతో మంచాల మండలంలోని లింగంపల్లి సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. ఓ కోళ్ల ఫారంలో పనిచేస్తున్న రహమతుల్లాను పట్టుకున్న స్థానిక పోలీసులు గుజరాత్ పోలీసులకు అప్పగించారు.

లాడ్జి గదిలో వ్యక్తి మృతి

కొత్తూరు: లాడ్జి గదిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. కేశంపేట మండలం సంగెం గ్రామానికి చెందిన జోగన్నగూడెం రమేశ్(37) ఈ నెల 19న పని ఉందని ఇంట్లో చెప్పి కొత్తూరుకు వచ్చాడు. కొంత కాలంగా ఆయనకు మూర్ఛా, ఇతర అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. కాగా పట్టణంలోని ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని మద్యం తాగాడు. మధ్యరాత్రి లాడ్జి సిబ్బంది గమనించగా పడుకున్న చోటనే రమేశ్ విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఖజానా' కేసులో మరో ఇద్దరి అరెస్ట్

పుణేలో అంతర్రాష్ట్ర దొంగల్ని అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసులు

చందానగర్: 'ఖజానా' జ్యువెలరీలో దోపిడీకి సంబంధించి మరో ఇద్దరు దొంగలను పుణేలో సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం చందానగర్ డీఐ భాస్కర్ వివరాలు వెల్లడించారు. ఖజానా దొంగతనం కేసులో ఏడుగురు పాల్గొనగా ఇప్పటి వరకు నలుగుర్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే బిహార్‌కు చెందిన ఆశిష్, దీపక్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు కూడా బిహార్‌కు చెందిన అనిష్‌కుమార్ సింగ్, ప్రిన్స్ కుమార్ రజాక్‌లుగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. వీరిద్దరిని కూడా రిమాండ్‌కు తరలించామన్నారు. వారి వద్ద నుంచి 1015 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక పిస్తోల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగితా ముగ్గుర్ని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

పుస్తకాలు, పత్రికలు చదవండి

విద్యార్థులకు హైడ్రా కమిషనర్ సూచన

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులు ప్రతిరోజూ పుస్తకాలు, దిన పత్రికలను చదడం అలవాటుగా చేసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. బుధవారం ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రంగనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సానుకూల దృక్పథంతో భవిష్యత్‌కు మంచి పునాదులు వేసుకోవాలని సూచించారు. ఓయూ వీసీ ప్రొ.కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు క్రమం తప్పకుండ తరగతులకు హాజరుకావాలన్నారు. విద్యార్థుల జీవితంలో 90 శాతం విజయం కష్టపడి పని చేయడం వల్ల, 5 శాతం స్మార్ట్ వర్క్, 5 శాతం నెట్ వర్కింగ్ వల్ల లభిస్తుందన్నారు. సోషల్ మీడియాపై ఆధారపడకుండ పుస్తకాలను చదవడం అలవాటుగా పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్, ఇంజినీరింగ్ విభాగం సీనియర్ డైరెక్టర్ సుమన్ సిన్హా, ఇంజినీరింగ్ డీన్ ప్రొ.ఎ.కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.మంగు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బ్రిడ్జిలకు మోక్షం కలిగేనా!

- వర్షం వస్తే రాకపోకలు బంద్
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్: వానకాలం వచ్చిందంటే చాలు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కసారిగా కుండపోత వర్షం పడితే వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతాయి. రోడ్లపై, బ్రిడ్జిలపైనుంచి నీరు ప్రవహించడంతో అక్కడక్కడ ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతాయి. వానాకాలంలో ఎప్పుడు ఏమవుతుందోనని భయంతో బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ మండలం పూర్తిగా తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఉంది.

మండలంలో బ్రిడ్జిలు..

తాండూరు మండలంలో సంగెంకలాన్, అల్లాపూర్, బొంకూర్, ఐనెల్లి, కోత్లాపూర్ శివారులో వాగులు ఉన్నాయి. సంగెంకలాన్, అల్లాపూర్, ఐనెల్లి, కోత్లాపూర్ వాగుల వద్ద బ్రిడ్జిలు పురాతనమైనవి. ఒక్కోసారి భారీ వర్షాలకు వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్..

బిజ్వార్-బొంకూర్ వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంకా ప్రారంభించలేదు. వర్షాకాలం పూర్తయిన తర్వాత ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు.

అసంపూర్తిగా బెల్కటూర్ ..

తాండూరు నుంచి కరన్‌కోట్ మార్గంలోని బెల్కటూర్ వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల సందర్భంగా వాగులో నిర్మించిన డైవర్షన్ రోడ్డు ఇప్పటి వరకూ నాలుగు సార్లు కొట్టుకపోయింది. దీంతో బెల్కటూర్, చిట్టిఘనాపూర్, చంద్రవంచ, కరన్‌కోట్, ఓగిపూర్‌తో పాటు కర్ణాటకలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. వెంటనే పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సంగెం కలాన్ వాగు

సంగెంకలాన్ చుట్టూ వాగులే..

భారీ వర్షం వచ్చిందంటే చాలు సంగెంకలాన్ చుట్టూ ఉన్న వాగులు పొంగిప్రవహిస్తాయి. గ్రామానికి వెళ్లేదారిలోని వంతెనపై నుంచి వర్షపు నీటి ప్రవాహం ఉంటుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసరమయితేనే తాము వెళ్తామని వాపోతున్నారు. ప్రస్తుతం తాండూరు మండలంలో నేషనల్ హైవే పనులు కొనసాగుతున్నాయి. అల్లాపూర్, ఐనెల్లి, కొత్లాపూర్ బ్రిడ్జిలు నేషనల్ హైవే పరిధిలో రావడంతో ఇప్పటి వరకు కనీసం పనులు కూడా ప్రారంభించలేదు.

సత్వరమే పనులు చేపట్టాలి..



తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో సంగెంకలాన్ ఉంటుంది. ఇక్కడ బండి, దిద్ది వాగులు ప్రవహిస్తాయి. భారీ వర్షం వస్తే గ్రామం చుట్టూ ఉన్న వాగులు పొంగిపొర్లుతాయి. దీంతో అక్కడ రాకపోకలు నిలిచిపోతాయి. గతంలో వాగుదాటుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూడా ఉంది. అధికారులు స్పందించి సత్వరమే నిర్మాణ పనులు చేపట్టాలి.

– సంజీవ్‌రెడ్డి, సంగెంకలాన్ నివాసి

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..



బెల్కటూర్ బ్రిడ్జి పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఇక అల్లాపూర్, కోత్లాపూర్, ఐనెల్లి నిర్మాణ పనులు నేషనల్ హైవే అధికారులు చేపడుతారు. వర్షాకాలం ముగిసిన తర్వాత బొంకూర్ పనులు ప్రారంభమౌతాయి. సంగెంకలాన్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలో నిధులు మంజూరవుతాయి. అవి రాగానే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– శ్రావణ్‌కుమార్, డీఈ, ఆర్అండ్‌బీ, తాండూరు

కరన్‌కోట్‌కు నిలిచిన బస్సు సౌకర్యం

బెల్కటూర్ వద్ద తెగిన డైవర్షన్ రోడ్డు

తాండూరు మండలం బెల్కటూర్ వద్ద నూతన బ్రిడ్జి నిర్మిస్తున్నారు. వాహనాల రాకపోకల కోసం డైవర్షన్ రోడ్డు నిర్మించారు. కానీ భారీ వర్షం వల్ల నేటి వరకు ఐదుసార్లు కోట్టుకపోయింది. దీంతో తాండూరు-కరన్‌కోట్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. కరన్‌కోట్ గ్రామానికి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం నిలిపివేశారు.

ఐదు గ్రామాలకు నిలిచిన రాకపోకలు..

డైవర్షన్ రోడ్డు కొట్టుకపోవడంతో బెల్కటూర్, చిట్టిఘనాపూర్, చంద్రవంచ, కరన్‌కోట్, ఓగిపూర్‌లకు రాకపోకలు నిలిచిపోయాయి. తాండూరు నుంచి బెల్కటూర్ వరకు ఆటోలో వెళ్లాల్సి వస్తోంది. ఆ తర్వాత బ్రిడ్జిపైనుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.


బెల్కటూర్ బ్రిడ్జి వద్ద కొట్టుకపోయిన డైవర్షన్ రోడ్డు


సంగమేశ్వరాలయంలో దుండగులు ధ్వంసం చేసిన హుండీ


శనైశ్వరాలయంలో ధ్వంసమైన హుండీ

ఆలయాల్లో భారీ చోరీ

- రూ.లక్షకు పైగా నగదు, కానుకలు ఎత్తుకెళ్లిన దుండగులు
- సీసీ కెమెరాల వైర్లు కట్‌చేసి, ధ్వంసం చేసిన వైనం

యాలాల: మండలంలోని సంగెంకుర్దు పరిధిలో ఉన్న సంగమేశ్వరాలయం, శనైశ్వరాలయంలో భారీ చోరీ జరిగింది. పక్కపక్కనే ఉన్న ఆలయాల్లోని హుండీలను ధ్వంసం చేసిన దుండగులు పెద్ద మొత్తంలో నగదు ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సంగంకుర్దు శివారులోని కాకరవేణి నది ఒడ్డున సంగమేశ్వరాలయం, దీని పక్కనే శనైశ్వరాలయం ఉంది. ఎప్పటిలాగే ఆలయ పూజారి జగదీశ్ మంగళవారం రాత్రి గేట్లు మూసేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఆలయం తెరిచేందుకు వెళ్లగా హుండీలు, సీసీ కెమెరాలు ధ్వంసమైనట్లు గుర్తించి, చైర్మన్‌తో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌ఐ విఠల్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సంగమేశ్వరాలయ హుండీలో సుమారు రూ.50 వేల నుంచి 60 వేల వరకు నగదు, బహుమతులు, శనైశ్వరాలయంలోని హుండీలో దాదాపు రూ.50 వేల నగదు, భక్తులు వేసిన కానుకలు చోరీకి గురయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వరుసగా నాలుగో సారి..

సంగమేశ్వరాలయంలో వరుసగా నాలుగోసారి దొంగలు పడ్డారని స్థానికులు తెలిపారు. ఆలయం గ్రామానికి దూరంగా ఉండటంతో ఈ దురాఘతానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆలయ అభివృద్ధికి వినియోగించే భక్తుల డబ్బులు దొంగల పాలవుతున్నాయని తెలిపారు. సీసీ కెమెరాల వైర్లను కట్ చేయడంతో పాటు ధ్వంసం చేసి చోరీలకు పాల్పడటంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

నందిగామ: గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. ఈ సంఘటన మండల పరిధిలోని చాకలిదానిగుట్టతండా సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తండావాసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. తాటిగడ్డతండాకు చెందిన జటావత్ చాందిని(63) మంగళవారం సాయంత్రం నందిగామలో కూరగాయలు అమ్ముకొని, ఇంటికి వెళ్తుండగా తండా సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై, కల్వర్టు గుంతలో పడి చనిపోయింది. బుధవారం ఉదయం ఇది గమనించిన తండావాసులు కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలిపారు. మృతురాలి భర్త గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

రూ.50 వేలు ఇవ్వకుంటే వీడియో వైరల్ చేస్తా

- యువకుడికి క్యాబ్‌డ్రైవర్ బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: 'వెనుక కూర్చొని మీరు చేసిన పనులన్నీ గమనించా..వీడియో తీశా..వీటిని సోషల్ మీడియాలో వైరల్ చేయకుండా ఉండాలంటే రూ.50 వేలు ఇవ్వాలి' అంటూ బెదిరింపులకు పాల్పడిన క్యాబ్ డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కవాడిగూడకు చెందిన అహ్మద్ అనే యువకుడితో పాటు మరో యువతి హైటెక్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ స్నేహితులు. ఈ నెల 17వ తేదీన వీరిద్దరూ విధులు ముగిసిన తర్వాత సాయంత్రం 5.30 గంటలకు కవాడిగూడ వెళ్లేందుకు క్యాబ్ మాట్లాడుకున్నారు. జహీరాబాద్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ శ్రీనివాస్ వీరిద్దరినీ ఎక్కించుకుని వెళ్తుండగా మార్గమధ్యలో బంజారాహిల్స్ రోడునెంబర్-2లోని టీవీ-9 సమీపంలో ఓ స్నేహితుడిని కలిసేందుకు 20 నిమిషాలు ఆగి.. తిరిగి బయలుదేరారు. వీరిద్దరినీ కవాడిగూడలో దింపిన తర్వాత అహ్మద్ జీపే ద్వారా బిల్లు చెల్లించాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి అహ్మద్‌కు ఓ మేసేజ్ వచ్చింది. నువ్వు వెనుక కూర్చొని ఆ అమ్మాయితో ఏమేమీ చేశావో అన్నీ తాను రికార్డ్ చేశానని, వీటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయకుండా ఉండాలంటే రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. గంటసేపటిలోగా డబ్బులు ఇవ్వకపోతే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని హెచ్చరించాడు. తన వద్ద అంత డబ్బు లేదని, తాను చిన్న ఉద్యోగినని అహ్మద్ చెప్పగా, ఒక రోజు గడువు ఇస్తున్నానని, తెల్లారిలోగా రూ.50 వేలు తెచ్చివ్వాలని హెచ్చరించాడు. దీంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఊబర్ క్యాబ్ డ్రైవర్ శ్రీనివాస్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 77, 308 (3), 351 (2), ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హజ్ యాత్రకు 4,292 మంది

సాక్షి సిటీబ్యూరో: హజ్ యాత్ర-2026కు కంప్యూటర్ డ్రా పద్ధతిలో రాష్ట్ర వ్యాప్తంగా 4,292 మంది యాత్రికులు ఎంపికయ్యారని కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ బియబానీ ఖుస్రో పాషా తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ నుంచి 11,757 మంది దరఖాస్తు చేసుకోగా.. 4,292 మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేసినట్లు తెలిపారు. నగరం నుంచి అత్యధికంగా 2,210 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన యాత్రికులు మొదటి విడుతగా రూ.1,52,300 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. దస్తావేజులు ఈ నెల 30వ తేదీలోపు హజ్ కమిటీ కార్యాలయంలో జమ చేయాలని సూచించారు.

సిటీలో ఎక్కడ చూసినా సమస్యలే

కాచిగూడ: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ నగర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు 'ఛలో సెక్రటేరియట్ - సేవ్ హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో ఎక్కడ చూసినా నీళ్ల విద్యుత్, డ్రైనేజీ, రోడ్ల సమస్యలే దర్శనమిస్తున్నాయని తెలిపారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

వెంగళరావునగర్: నగరంలోని కాలనీలు, బస్తీలు నిరంతరం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్-19 పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ.. పరిశుభ్రత, ప్రజారోగ్యం.. ఈ రెండూ విడదీయరాని అంశాలని, పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని చెప్పారు. ఆరోగ్యకర నగర నిర్మాణమే లక్ష్యంగా మాన్సూన్ శానిటేషన్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్టు పేర్కొన్నారు. నగర ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో క్రియాశీలక భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వానలు తగ్గుముఖం పట్టినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసేందుకు నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కర్ణన్ సూచించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయం, జానకమ్మతోట, రహమత్‌నగర్, ఎస్‌పీఆర్ హిల్స్, బోరబండ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. కర్ణన్ వెంట శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్ఖడే హేమంత్ సహదేవ్‌రావు, హెల్త్ అండ్ శానిటేషన్ అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్, సర్కిల్-19 ఉప కమిషనర్ రజినీకాంత్ రెడ్డి, ఏసీపీ ప్రదీప్, డీఈఈ భద్రు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

కొత్వాల్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ కోర్టు



సాక్షి, సిటీబ్యూరో: అదనపు జిల్లా మేజిస్ట్రేట్ అధికారాలు కలిగిన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఎగ్జిక్యూటివ్ కోర్టు నిర్వహించారు. సౌత్, సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్ జోన్లలో ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్న రౌడీషీటర్లు, క్రిమినల్ గ్యాంగ్‌ల సమస్యను పరిష్కరించారు. పోలీసుస్టేషన్ల నుంచి వచ్చిన నివేదికలను పరిశీలించిన కొత్వాల్ ఆయా గ్యాంగ్‌లు పరస్పరం దాడులు, హత్యలు, హత్యాయత్నాలు వంటి నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. మొత్తం పది పోలీసుస్టేషన్లకు సంబంధించిన 11 గ్యాంగ్‌లకు చెందిన 101 మందిని విడిగా విచారించారు. అందులో ఆరు గ్యాంగ్‌లు తమ పెద్దలు, కుటుంబీకుల సమక్షంలో శాంతియుతంగా రాజీ చేసుకున్నామని కొత్వాల్‌కు తెలిపాయి. మిగిలిన గ్యాంగ్‌లు భవిష్యత్తులో కూడా శాంతియుతంగా ఉంటామని హామీ ఇచ్చాయి. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా శాంతికి భంగం కలిగించే అవకాశం ఉన్నట్లయితే వారితో బాండ్ రాయించుకుంటామని తెలిపారు. ఆపై ఈ కోర్టు విచారణను తదుపరి విచారణకు వాయిదా వేశారు. ఈ కోర్టుకు స్పెషల్ బ్రాంచ్ డీసీపీ అపూర్వరావుతో పాటు పది ఠాణాలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

ఎలక్షన్ కమిషన్ మోదీ కమిషన్‌గా మారింది

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల విమర్శ

పంజగుట్ట: దేశంలో హిందుత్వ, ఫాసిస్టు విధానాల అమలులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌ను మోదీ కమిషన్‌గా మార్చిందని పలువురు వక్తలు విమర్శించారు. తెలంగాణ డెమోక్రటిక్ ఫోరం, జాగో నవ భారత్, ఓట్ నీడ్ గ్యారంటీ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'వుయ్ డిమాండ్ ఇండిపెండెంట్ ఎలక్షన్ కమిషన్-ఫెయిర్ ఎలక్షన్స్' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రకుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత చలపతి రావు, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల మాయాజాలంలో ఓట్ల చోరీతో ఎన్నికల్లో గెలిచి రాజ్యాంగ యంత్రాంగాలను నిర్వీర్యం చేస్తున్నారని, బిహార్ రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగబోతున్నందున ఎన్నికల కమిషన్ కొత్త నాటకం ఆడుతుందని, అందులో భాగమే ఓటర్ల సవరణ అని అభిప్రాయపడ్డారు. ఎలక్షన్ కమిషన్ అనేది ఒక స్వతంత్ర బాడీగా ఉండాలని, అప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగుతుందన్నారు. ఇప్పుడు ఎలక్షన్ కమిషన్ అధికార పార్టీకి తొత్తుగా మారిందని విమర్శించారు. ఒకప్పుడు ఎన్నికల్లో ఫిజికల్ రిగ్గింగ్ జరిగేదని, ఇప్పుడు డిజిటల్ రిగ్గింగ్ జరుగుతోందని ఆరోపించారు. సమావేశంలో ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, జానకి రాములు, పోటు రంగారావు, వి.శ్రీనివాస్, సోగ్రాబేగం, పాశం యాదగిరి, బండి దుర్గా ప్రసాద్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సెకండ్ 'హ్యాండ్' !

మోసగాళ్లు తెలివిమీరుతున్నారు. జనాన్ని మోసం చేసి ఈజీగా మనీ సంపాదించడం కోసం కొత్తదారులు వెతుక్కుంటున్నారు. కార్లను అద్దెకు తీసుకుని, ఫేక్ నంబర్లు, ఆర్సీ తయారు చేసి ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. అదే కారును తస్కరించి, తిరిగి యజమానులకు అప్పగిస్తున్నారు. ఈ ముఠాను మాచారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

అద్దెకు తెచ్చి.. ఫేక్ నంబర్ తయారు చేసి

- ఫేస్‌బుక్ ద్వారా తక్కువ ధరకు విక్రయం
- ఆపై అదే కారును చోరీ చేసి.. యజమానికి అప్పగింత
- ముఠా గుట్టురట్టు చేసిన మాచారెడ్డి పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్, పరారీలో మరొకరు
- వివరాలు తెలిపిన ఎస్పీ రాజేశ్ చంద్ర


పట్టుబడిన నిందితులతో పోలీసులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన ఉప్పల్వాయి ప్రశాంత్ గౌడ్ ఫేస్‌బుక్ అప్లికేషన్‌లో చూసి సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేశాడు. ఆ మరుసటి రోజు ఓ వ్యక్తి వచ్చి అది తన కారని చెప్పి తీసుకుపోయాడు. కారు విక్రయించిన వ్యక్తులకు ఫోన్ చేయగా.. అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన గతనెల 7వ తేదీన మాచారెడ్డి పీఎస్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపగా కొత్త రకం మోసం వెలుగు చూసింది. కొందరు ముఠాగా ఏర్పడి సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలించారు.

ముఠాగా ఏర్పడి..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపీనగర్‌కు చెందిన మహమ్మద్ ఇయాజ్, వికారాబాద్‌లోని ఆలంపల్లికి చెందిన మహమ్మద్ జాహీద్ అలీ, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన పృథ్వి జగదీష్, రాచర్ల శివకృష్ణ, వేములవాడకు చెందిన వివేక్, శేరిలింగంపల్లి మండలానికి చెందిన కర్ణకోట సాకేత్, అలీ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు ముందుగా ట్రావెల్స్ సంస్థల నుంచి వ్యక్తిగతంగా ఇచ్చే సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను అద్దెకు తీసుకుంటారు. వాటి నంబర్ ప్లేట్‌లు మార్చేసి నకిలీ ఆర్సీ, ఇతర పత్రాలు సృష్టిస్తారు. అనుమానం రాకుండా నకిలీ ఆర్సీ తయారు చేయడానికి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లలో ఖాళీ మైక్రో సిమ్ కార్డులు, ఖాళీ చిప్ కార్డులను కొంటారు. వాటిపై పేర్లు, వివరాలను ప్రింటింగ్ చేస్తారు. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఇతర పత్రాలన్నీ తయారు చేస్తారు. ఆపై ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో కారు అమ్మకానికి ఉందని పెట్టి, తక్కువ ధరకే వాటిని అమ్మనున్నట్లు పేర్కొంటారు. కారు, చౌక ధరను చూసి ఆకర్షితులైనవారు వారి వలలో చిక్కుతున్నారు.

ట్రాకర్లను అమర్చి చోరీ..

కారును అమ్మేటప్పుడు దాంట్లో జీపీఎస్ ట్రాకర్‌ను అమరుస్తారు. దీంతో కారు ఎక్కడుందో వారికి తెలిసిపోతుంది. కారున్న చోటుకు వెళ్లి రాత్రికి రాత్రి వారు విక్రయించిన కారునే చోరీ చేసి తీసుకువచ్చి అసలు యజమానికి అప్పగిస్తున్నారు. అలా వీలు కాని సందర్భాల్లో ఇతరులను పంపి కారు మాది అంటూ బెదిరింపులకు పాల్పడి ఎత్తుకొస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని కారు అమ్మిన తర్వాత రెండు నుంచి మూడు రోజుల వ్యవధిలో పూర్తి చేస్తున్నారు.

నిందితులపై పలు కేసులు..

నిందితులు ఈ విధంగా గతంలోనూ పలు చోట్ల నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. శంకర్‌పల్లి, మంచాల, అంబారిపేట, రామచంద్రాపురం, చందానగర్, మియాపూర్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లలో నిందితులపై పలు కేసులు నఉన్నాయని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. మాచారెడ్డిలో కేసు నమోదైన నాటి నుంచి పరారీలో ఉన్న వారిలో ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. వారిని బుధవారం రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు అలీ ఇంకా పరారీలో ఉన్నాడన్నారు. నిందితుల వద్ద నుంచి మూడు కార్లు, 15 సెల్‌ఫోన్‌లు, జీపీఎస్ పరికరాలు, ల్యాప్‌టాప్, 10 మైక్రో సిమ్‌కార్డులు, చిప్ కార్డులు, ఫోర్జరీ చేసిన ఆర్సీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన రూరల్ సీఐ రామన్, ఎస్సై అనిల్, ఐటీ సెల్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది సుభాష్‌రెడ్డి, సిద్ధిరాములు, శ్రీకాంత్‌లను అభినందించారు. సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అధికారులు పాల్గొన్నారు